జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





గురువారం, ఫిబ్రవరి 19, 2026 పేజీలు:6


# భూత్పూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## పీహెచ్‌సీ, కేజీబీవీ సందర్శన
## పరిశుభ్రత, నాణ్యమైన సేవలపై దృష్టి



మహబూబ్ నగర్ ఫిబ్రవరి 18
( ప్రజా జ్యోతి బ్యూరో )

భుత్పుర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి), అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీని సందర్శించిన కలెక్టర్, పదవ తరగతి విద్యార్థులు రాసిన ప్రీ–ఫైనల్ హిందీ పరీక్ష పత్రాలను పరిశీలించారు.

-మిగతా 2లో..



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

# శాంతియుతంగా నిర్వహించండి

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు :ఎస్పీ జానకి

మహబూబ్ నగర్ ఫిబ్రవరి 18
( ప్రజా జ్యోతి బ్యూరో )

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జిల్లాలో నిర్వహించబడే ఉత్సవాలు, ర్యాలీల దృష్ట్యా శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పి దరావత్ జానకి నిర్వాహకులకు కఠిన సూచనలు జారీ చేశారు. జిల్లా ఎస్పి సూచనలు -- తప్పనిసరిగా పాటించవలసినవి :

ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

పోలీసులు సూచించిన మార్గాల్లోనే ర్యాలీ నిర్వహించాలి.

-మిగతా 2లో..





వీధి కుక్కల నియంత్రణకు తగిన

# చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

# ఆగమ్మై..అప్పులు భారమ్మై..




- -అగమ్యగోచరంగా అభ్యర్థుల పరిస్థితి
- -పార్టీల నుంచి భరోసా అందక
- -పోటాపోటీగా ఖర్చు
- -గెలిచిన వారి పరిస్థితి అంతే
- -కుటుంబాల్లో కంటతడి

(ప్రజాజ్యోతి) ఫిబ్రవరి 18

: మున్సిపల్ ఎన్నికల పుణ్యామా అని... వందలాది కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పోటీ కోసం చేసిన ఖర్చు తడిసి మోపడయ్యాయి. ఇప్పుడు అప్పులు తీర్చేదెలా..? అని ఓటమి చెందిన అభ్యర్థుల కుటుంబాల్లో తీవ్ర అంతర్మథనం నెలకొంది. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చాయని పోటీ చేస్తే..తీరా ఇంత పెద్ద ఎత్తున ఖర్చు చేసినా..గెలువకపోతిమి. ఉన్న ఆస్థులు,

-మిగతా 2లో..

# భూత్పూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ "ఈరోజు హిందీ పరీక్ష ఎలా రాశారు?" అని ప్రశ్నించారు. పరీక్ష పత్రంలోని ప్రశ్నలను విద్యార్థులతో చదివించి వారి అవగాహనను పరీక్షించారు.
మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ ఆహార నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత విద్యాభ్యాసం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.
పాఠశాల ఆవరణలో ఆట స్థలం, షెడ్ నిర్మాణానికి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్, ఇన్‌పేషంట్ వార్డు, ల్యాబ్, ఔషధాల నిల్వ, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. ప్రతి నెల గర్భిణీల జాబితా ప్రకారం వారికి సమయానికి చెకప్‌లు, వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ నెలలో నాలుగు డెలివరీలు జరిగినట్లు మెడికల్ ఆఫీసర్ వివరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఆగమై... అప్పుల భారమై

బంగారం పాయే..అప్పుల కుప్పాయే..అంటూ చాలా కుటుంబాలు కుమిలి పోతున్నాయి.

అగమ్యగోచరంగా అభ్యర్థుల పరిస్థితి..
మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాహతుకు మించి ఖర్చుపెట్టినా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితికి గురవుతున్నారు. ఉన్న ఆస్తులు పోయి అప్పుల పాలయ్యారు. చాలా మంది ఎన్నికల ఖర్చు కోసం తమ పొలాలు, ప్లాట్లు, ఇళ్లు, బంగారం కుదవ పెట్టి అప్పులు తీసుకున్నారు. మరికొందరైతే ఏకంగా ఆస్తులకు రిజిస్ట్రేషన్లే చేసి డబ్బులు తీసుకున్నారు. రూ. 50 లక్షల వరకు పైగా విలువ ఉన్న ప్లాటును, పొలాన్ని కేవలం రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల లోపే తీసుకొని సేల్ డీడ్‌లు చేయించిన సంఘటనలు ఉన్నాయి. మరికొందరు తమకు నమ్మకం ఉన్న వారి దగ్గర, తమ బంధువుల వద్ద రూ. లక్షల్లో అప్పులు తెచ్చి ఖర్చు పెట్టారు. తీరా ఫలితాలు విరుద్ధంగా రావడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

పార్టీల నుంచి భరోసా అందక..

ఓడిపోయి నైరాశ్యంలో ఉన్న అభ్యర్థులకు వారివారి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు పెద్దల నుంచి పెద్దగా ధైర్యం, భరోసా కూడా లేకపోవడంతో ఇంకా ఆందోళనకు గురవుతున్నారు.

పోటాపోటీగా ఖర్చు...
జిల్లాకేంద్రంలోని పలు వార్డులు, జిల్లాలో పట్టణాలకు దగ్గరగా ఉన్న వార్డులు, రాజకీయంగా పలుకుబడి ఉన్న వార్డుల్లో, పట్టణాల్లో ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో చాలా మంది అభ్యర్థులు పోటీ పడి ఖర్చు చేశారు. చాలా మంది అభ్యర్థులు రూ. 30 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు, మరికొందరు రూ. 60 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఇలా ఇంతకంటే ఎక్కువే ఖర్చు పెట్టి ఓడిపోయారు. మరికొందరు అధికంగా ఖర్చు చేసి గెలుపొందారు.

ప్రధాన పార్టీల్లో పోటాపోటీ....

ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన పలువురు అభ్యర్థులు వ్యయం చేయడానికి పోటీ పడ్డారు. ఎక్కువ ఖర్చు పెట్టగలిగే సత్తా ఉన్న నాయకులకే పార్టీలు టికెట్లను కేటాయిస్తామని తేల్చి చెప్పారు. మున్సిపల్ ఎన్నికల గెలుపొందాలంటే అంగబలం, అర్థబలం ఉంటేనే విజయం వరిస్తుందన్న కారణంతో పార్టీలు సైతం అటువంటి అభ్యర్థులను ఆచితూచి ఎంపిక చేశారు. దీంతో పోటీలో నిలిచిన పార్టీ అభ్యర్థులకు వ్యయభారం తప్పలేదు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీల్లో సైతం వ్యయం వ్యవహారంలో అదేతీరు చోటుచేసుకుంది.. ప్రధాన పార్టీ అభ్యర్థులతో పోటీపడి ఖర్చులు పెట్టడానికి పలు పట్టణాలు, వార్డుల్లో ప్రయత్నించారు. మున్సిపల్ చైర్మన, వైస్ చైర్మన పదవిపై ఆశతో పోటీలో ఉంటున్న పలువురు అభ్యర్థులు వ్యయభారం మోశారు. ప్రత్యర్థులకు ధీటుగా అర్థబలం, అంగబలం ఉపయో గించి పలు స్థానాల్లో అభ్యర్థులు పోటీకి దిగారు.

గెలిచిన వారి పరిస్థితి అంతే...
ఓడిపోయిన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్ల పరిస్థితే కాదు..రూ. లక్షలు పెట్టి గెలిచిన మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, వార్డు కౌన్సిలర్ల పరిస్థితి కూడా దయనీయంగానే తయారైంది. రూ. లక్షలు పెట్టి గెలిచాం.. ఈ అప్పులు ఎలా తీర్చాలో ఏం చేద్దామన్న ఆలోచనలో చాలా మంది గెలిచిన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఏదిఏమైనా మున్సిపల్ ఎన్నికలు చాలా కుటుంబాలను ఆర్థికంగా, మానసికం గా కోలుకోలేకుండా చేశాయన్న అభిప్రాయాలున్నాయి.
కుటుంబాల్లో కంటతడి..
గెలుస్తామన్న నమ్మకంతో ఉన్న ఆస్తులు తాకట్టు పెట్టి లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా గెలవకపోవడంతో చాలామంది ఓడిపోయిన అభ్యర్థులు, వారి కుటుంబాలు ఇంకా ఆ షాక్ నుంచి తేరుకోలేకపోతున్నాయి. పైసలు తీసుకుండ్రు...తాగిండ్రు...తిన్నరు..మమ్మల్ని మోసం చేసింద్రు.. ఈ అప్పులు ఎట్లా తీర్చాలో... అంటూ చాలా కుటుంబాలు కంటతడి పెడుతున్నాయి. బంధువులు వచ్చి ధైర్యం చెబుతూ ఓదారుస్తున్న పరిస్థితి చాలా కుటుంబాల్లో కనబడుతోంది.

### వీధి కుక్కల నియంత్రణకు తగిన

## చర్యలు తీసుకోవాలి

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి)

వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం కార్యాచరణ జంతు జనన నియంత్రణ (ఏబీసీ) మరియు రేబిస్ టీకాలపై ప్రత్యేక దృష్టి పెట్టి స్టెరిలైజేషన్ వేగవంతం చేస్తూనే, ప్రమాదకరమైన కుక్కల కోసం ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.
ప్రజలు భయాందోళనలకు గురికాకుండా ఉండటానికి, వీధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రదేశాలను నియంత్రిస్తూ (ఫీడింగ్ జోన్లు) కీలక నిర్ణయాలు తీసుకోవాలన్నారు.
బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..
ఏబీసీ & టీకాలు: 2023 నియమాల ప్రకారం కుక్కలకు స్టెరిలైజేషన్, రేబిస్ టీకాలు వేసి, పట్టుకున్న చోటే వదిలివేయాలని,
ప్రత్యేక ఆహార జోన్లు: రోడ్లపై, నడిచే దారుల్లో కుక్కలకు ఆహారం పెట్టడం నిషేధించి, ప్రత్యేక ప్రాంతాలు ఏర్పాటు చేయాలన్నారు.
సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుక్కల జనాభా నియంత్రణలో నిర్లక్ష్యం వహించవద్దని, శాస్త్రీయ పద్ధతులు పాటించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.
వీధి కుక్కల నియంత్రణకు జంతు సంక్షేమ చట్టాలను పాటిస్తూనే, ప్రజా భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు.
జిల్లాలో వీధి కుక్కల బెడద చాలా ఉందని తెలిపారు. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూ వాటిని ప్రతీ గ్రామంలో ఊరి బయట ఒక షెల్టర్ ఏర్పాటు చేసి, వీధి కుక్కలను అక్కడికి తరలించి అక్కడే వాటికి ఫుడ్, తాగునీటి వసతి కల్పించాలన్నారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర సముదాయాలలో ఇక పై వీధి కుక్కల సంచారం ఉండకుండా చుట్టూ కట్టుదిట్టమైన ప్రహరీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ మున్సిపాలిటీ కేంద్రంలో, ప్రతి మండల కేంద్రంలో తప్పనిసరిగా ఒక ఎనిమల్ కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని, గ్రామాల వారీగా ఉన్న కుక్కల సంఖ్య లెక్కించి వాటిని ఎనిమల్ కేర్ సెంటర్ కు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించి, ఎక్కడి నుంచి వాటిని తీసుకువచ్చామో తిరిగి అక్కడే వదిలి పెట్టాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో ఒకే ఒక్క ఎనిమల్ కేర్ సెంటర్ ( డంపింగ్ యార్డ్ వద్ద) ఉందని, బ్లూ క్రాస్ సహకారంతో ఎన్ జీ ఓ తో ఒప్పందం చేసుకుని పట్టణంలోని వీధి కుక్కలను అక్కడికి తరలించి స్టెరిలైజేషన్ ( సంతాన నిరోధక శస్త్ర చికిత్స) చేసి తిరిగి వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చామో అక్కడే వదిలి పెట్టాల్సి ఉంటుందన్నారు. కేవలం వీధి కుక్కలే కాకుండా జాతీయ రహదారులు, రోడ్లపై తిరిగే ఆవులు, ఎద్దులను గో శాల కు తరలించాలన్నారు. జిల్లా లోని మక్తల్, కోస్గి, మద్దూరు మున్సిపాలిటీలలో ఎనిమల్ కేర్ సెంటర్ లను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అప్పటి వరకు నారాయణపేట లో ఉన్న ఎనిమల్ కేర్ సెంటర్ కు జిల్లాలోని అన్ని గ్రామాలలోని వీధి కుక్కలను తీసుకువచ్చి స్టెరిలైజేషన్ చేయించి, తిరిగి ఆయా గ్రామాలకు వాటిని తరలించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు మందకొడిగా సాగుతున్నాయని, వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాలు, మండలాలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో టార్గెట్లను అచీవ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో నారాయణపేట మక్తల్ మద్దూర్ మున్సిపాలిటీల కమీషనర్లు నర్సయ్య, శ్రీ రాములు,శ్రీకాంత్, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు శాంతియుతంగా నిర్వహించండి

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సమయపాలన పాటించాలి.
ప్రధాన రహదారులను దిగ్బంధం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
డీజేలు, అధిక శబ్ద పరికరాలు ఉపయోగించరాదు.
శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.
అశాంతి లేదా ఉద్రిక్తతలకు దారితీసే నినాదాలు, ప్రవర్తన చేయరాదు.
ర్యాలీ భద్రత కోసం నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను నియమించాలి.
మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి.
ర్యాలీలో పాల్గొనే వాహనాలు నియంత్రిత వేగంతో నడపాలి.
ప్రజా ఆస్తులకు నష్టం కలిగితే నిర్వాహకులపై బాధ్యత ఉంటుంది.
అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన
వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
మద్యం సేవించి ర్యాలీలో పాల్గొనడం పూర్తిగా నిషేధం.
అత్యవసర వాహనాల రాకపోకలకు మార్గం ఖాళీగా ఉంచాలి.
పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలి.
అనుమతి నిబంధనలు ఉల్లంఘించినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి.
డీజేలు లేదా నిషేధిత శబ్ద పరికరాలు ఉపయోగించినట్లయితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.
చట్టవ్యతిరేక చర్యలు, శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకోబడతాయి.

పోలీసుల ఆదేశాలను పాటించని నిర్వాహకులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయబడతాయి. శాంతియుత వాతావరణం కాపాడేందుకు నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఎస్పి సూచించారు. ఉత్సవాలను నియమ నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని హెచ్చరించారు.

# ప్రకృతి వ్యవసాయంలో రైతులు భాగస్వాములు కావాలి

**ఎర్రవల్లి/ఇటిక్యాల:ఫిబ్రవరి 18(ప్రజాజ్యోతి):**
ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో రైతులు భాగస్వామ్యులు కావాలని అలంపూర్ వ్యవసాయ సంచాలకులు ఏడిఏ సక్రియ నాయక్ అన్నారు,బుధవారం ఎర్రవల్లి మండలం తిమ్మాపురం గ్రామం పంచాయతి లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.. ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సోదరులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమిసంహారక మందులు వాడకం తగ్గించి ఈ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూమిలో ఉన్న భూసారం పెరగడమే కాకుండా నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుతూ మరియు మానవుని వ్యాధి(జబ్బులు ఽ క్యాన్సర్) నుంచి తగ్గించుకోవచ్చని,జీవామృతం దేశీ ఆవులు పేడ 20కేజీ ల పేడ మరియు ఆవు మూత్రముం రెండు కేజీల బెల్లం 200 లీటర్ల వాటర్ పుట్టమన్ను,పప్పు దినుసుల పొడి ఒక కేజీ, పైన తెలిపిన మిశ్రమాలను ఒక డ్రమ్ములో పోసుకొని వాటిని ఒక మూడు నుంచి నాలుగు రోజులు కలయబెట్టుకొని..తయారు చేసుకున్న జీవామృతం 15 రోజులు వాడుకోవచని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో:మండల వ్యవసాయ అధికారి సురేష్ గౌడ్,ఏఈఓ నరేష్,సర్పంచ్ కల్పన శంకర నాయుడు,రైతులు వసంత్ కుమార్




రెడ్డి, రవీంద్రమ్మ,అనూష,వడ్ల రామకృష్ణ,జగదీశ్వర్ రెడ్డి, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఆర్యవైశ్యులకు తీరని ద్రోహం

**అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి**
**ఆర్యవైశ్య మహాసభ మండల శాఖ అధ్యక్షుడు గంధం ప్రసాద్**
**ఆర్య వైశ్యులు తలపెట్టిన బంధు ప్రశాంతం**

**కల్వకుర్తి,ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి):**
మున్సిపాలిటీ ఎన్నికలలో, ఎన్నికల అనంతరం కల్వకుర్తి నియోజకవర్గం లో వివిధ పార్టీలు ఆర్యవైశ్యులకు తీరని ద్రోహం చేయడంతో పాటు అక్రమంగా కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ మండల శాఖ అధ్యక్షుడు గంధం ప్రసాద్, మాజీ అధ్యక్షుడు శివాలయం శ్రీనివాస్ లు అన్నారు.మంగళవారం కల్వకుర్తిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో ఏ ఒక్క పార్టీ ఆర్యవైశ్యులకు స్థానం ఇవ్వలేదన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికలలో బిఆర్ఎస్ 8 స్థానాలలో విజయకేతనంఎగురవేసింది.
ఆ పార్టీకి చెందిన పాపిశెట్టి రాముకు చైర్మన్ పదవి ఖరారు చేశారు. దీంతో క్షుద్ర రాజకీయాలకు తెరలేపి కుట్రపూరితంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్, బిజెపి పార్టీలు చేతులు కలిపి చైర్మన్ పదవి ఆర్యవైశ్యునికి రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.ఇదంతా ఒక ఎత్తైతే ఆగ్రహంతో కొంతమంది కార్యకర్తలు చేసిన




పనిని ఉప్పల వెంకటేష్, పాపిశెట్టి రాముకు అంటగట్టి వారిపై అక్రమంగా కేసులు బనయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.వెంటనే అక్రమ కేసులనుఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులను నిరసిస్తూ బుధవారం కల్వకుర్తి పట్టణంలోని వ్యాపార వాణిజ్య సముదాయాల బందుకు పిలుపునిస్తున్నట్లు వారు తెలిపారు.రాబోయే రోజుల్లో మరిన్ని ఆందోళనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని గంధం ప్రసాద్, శివాలయం శ్రీనివాస్, గంప శ్రీనివాసులు తెలిపారు.ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దొంతు శ్రీనివాసులు, నర్సింహులు గుప్తా, పూరిరమేష్ ,దాచేపల్లి మనోహర్, సామల నరసింహ, దాచేపల్లి తిరుపతయ్య, గణేష్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.


# నాణ్యత లేని భోజనం పెడుతున్నారంటూ కొల్లాపూర్ లో పీజీ కళాశాల విద్యార్థుల ఆందోళన



**కొల్లాపూర్ ఫిబ్రవరి 18 ప్రజా జ్యోతి**
కొల్లాపూర్ పీజీ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు హాస్టల్ లో వసతులు సక్రమంగా లేవు అని నాణ్యత లేని భోజనం పెడుతున్నారు అంటూ రోడ్డుపై బైఠాయించి నా పీజీ కళాశాల విద్యార్థులు. రాత్రివేళ సమయంలో కాలేజీ ఆవరణలో రూముల్లోకి పాములు తేళ్లు వస్తున్నాయని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని విద్యార్థుల ఆవేదనలు వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యల పైన పలుసార్లు పీజీ కాలేజీ యాజమాన్యానికి విద్యార్థులు లిఖితపూర్వకంగా పలుసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని బుధవారం రోజు పీజీ కాలేజీ ఆవరణ ముందు రోడ్డుపై బటాయించిన విద్యార్థులు. అనంతరం హాస్టల్లో వసతుల విషయంలో నాణ్యత మైన క్వాలిటీ భోజనాలు కల్పించాలని రోడ్డుపైన నిరసనలు వ్యక్తం చేస్తున్న పీజీ కాలేజీ విద్యార్థులు. రోడ్డుపై బఠాయించిన విద్యార్థులు రాకపోకలకు అంతరాయం కలిగిందన్న విషయం పైన స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వగా మోకాపైకి స్థానిక పోలీసులు వెళ్లారు. అనంతరం ఇలా విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తుంటే పీజీ కాలేజీ ఏజమాన్యం పోలీసులు వచ్చి మీకు మళ్ళీ ఇలా జరగకుండా చూసుకుంటామని విద్యార్థులతో మంతనాలు జరిపి నాణ్యతమైన భోజనాలు వసతులు కల్పిస్తామని ప్రిన్సిపల్ విద్యార్థులకు భరోస నిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల పేద పిల్లలకు విద్య వైద్య పరంగా అన్ని వసతులు కల్పిస్తున్న కాలేజీల యాజమాన్యం హాస్టల్లో యజమాన్యం గురుకులాల యాజమాన్యం ఎందుకు ఇలా చేస్తుందని విద్యార్థులు నిరసనలతో ప్రభుత్వానికి విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పీజీ కాలేజీ యాజమాన్యం ప్రిన్సిపల్ విద్యార్థులతో మంతనాలు జరిపి మళ్లీ ఇలా జరగకుండా చూసుకుంటామని విద్యార్థులకు భరోసా ఇచ్చిన తర్వాత విద్యార్థులు నిరసనలను విరమించుకున్నారు.



# శంకరన్నకు పదవి కల్పించిన ఎమ్మెల్యేకు ఎమ్మార్పీఎస్ అభినందనలు



**గద్వాల ఫిబ్రవరి 18(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
ఎంఆర్పిఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.శంకరన్నకి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కల్పించినందుకు గద్వాల శాసనసభ్యులు బి.కృష్ణ మోహన్ రెడ్డికి ఎంఆర్పిఎస్ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ నాయకులు గువ్వల దీన్నే జంబయ్య మాట్లాడుతూ,శంకరన్న పై విశ్వాసం ఉంచి బాధ్యతాయుతమైన పదవి అప్పగించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. శంకరన్న ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తాలూకా మాజీ అధ్యక్షులు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**ఎర్రవల్లి/ఇటిక్యాల:(ప్రజా జ్యోతి)ఫిబ్రవరి 18:**
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం బి.వీరాపురం మాజీ సర్పంచ్ లక్ష్మీ నాయుడు భార్య శంకరమ్మ అనారోగ్యంతో మరణించింది.విషయం తెలుసుకున్న అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు వారి నివాసానికి వెళ్లి శంకరమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు, ఈ కార్యక్రమంలో:మాజీ జడ్పీ వైయస్ చైర్మన్ సరోజమ్మ బీరెల్లి రమేష్ నాయుడు, గార్లపాడు సుదర్శన్ రెడ్డి,సర్పంచ్ చిన్న సంజీవ నాయుడు,తిమ్మాపురం నారాయణ నాయుడు,పెద్ద సంజీవ నాయుడు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## హిందీ ప్రతిభ పరీక్షలో గీతాంజలి స్కూల్ విద్యార్థిని ఆర్తికి రాష్ట్రస్థాయి అవార్డు



**మద్దూర్ మండల ప్రతినిది ప్రజాజ్యోతి ఫిబ్రవరి18:**
హిందీ సేవాసదన్ మహావిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన హిందీ ప్రతిభ పరీక్షలో గీతాంజలి పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆర్తి ప్రతిభ చాటింది. 6వ తరగతి విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాన్ని అందుకుంది.ఆర్తి సాధించిన ఈ విజయంపై పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే హిందీ ప్రతిభ పరీక్ష వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తున్నాయని విద్యావేత్తలు పేర్కొన్నారు.

# పునర్వైభవ దిశగా ఎంబీసీ జూనియర్ కళాశాల

## -అభివృద్ధికి సహకారం అందిస్తాం
## - టీపీసీసీ కార్యదర్శి ఎస్.ఏ. వినోద్ కుమార్



**మహబూబ్ నగర్ ఫిబ్రవరి 18 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంబీసీ జూనియర్ కళాశాలను టీపీసీసీ కార్యదర్శి ఎస్.ఏ. వినోద్ కుమార్ సందర్శించారు. జీసీ ట్రెజరర్ ఏ. టైటస్ రాజేందర్ పిలుపు మేరకు జరిగిన ఈ సందర్శన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఈ.కె. తిమోతి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల స్థితిగతులపై జీసీ ట్రెజరర్ ఏ. టైటస్ రాజేందర్ వివరించారు. గతంతో పోలిస్తే కళాశాల రూపురేఖలు మారాయని, పునర్వైభవంగా ఈ విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. అయితే ఇంకా మౌలిక సదుపాయాల పరంగా అనేక అవసరాలు ఉన్నాయని పేర్కొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలని, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల ద్వారా అవసరమైన వనరులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని వినోద్ కుమార్‌ను కోరారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం, సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని వినోద్ కుమార్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి జడ్చర్ల ముదిరాజుల పాలాభిషేకం

## - స్థానిక రాజకీయాల్లో కుల సమీకరణాలపై కొత్త చర్చ
## -మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత నరసింహ



**జడ్చర్ల, ఫిబ్రవరి 18, ప్రజా జ్యోతి :**

జడ్చర్ల పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి రెండు మేయర్ పదవులు, ఐదు మున్సిపల్ చైర్మన్ పదవులు, పలు వైస్ చైర్మన్ స్థానాలు లభించడంపై కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత నరసింహ తెలిపారు. జడ్చర్ల సిగ్నల్ గడ్డ అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముదిరాజ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం గమనార్హం. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్న సంకేతంగా ఈ నియామకాలు భావించబడుతున్నాయి. ప్రత్యేకించి బీసీ వర్గాల ఓటు బ్యాంక్‌ను సమీకరించడంలో భాగంగా అధికార పార్టీ వ్యూహాత్మకంగా ఈ నిర్ణయాలు తీసుకుందని విశ్లేషిస్తున్నారు. జడ్చర్లలో జరిగిన ఈ పాలాభిషేకం కేవలం కృతజ్ఞత కార్యక్రమమే కాకుండా, భవిష్యత్ స్థానిక ఎన్నికల దృష్ట్యా సామాజిక ఐక్యతను ప్రదర్శించే రాజకీయ సందేశంగా కూడా పరిగణించవచ్చు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేణుక, మాజీ ఎంపీటీసీ లక్ష్మమ్మ, కురవగడ్డపల్లి సర్పంచ్ కరీం ముదిరాజ్, తంగళ్లపల్లి సర్పంచ్ మధుసూదన్ ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మణ్ ముదిరాజ్, జిల్లా మరియు తాలూకా స్థాయి ముదిరాజ్ మహాసభ నాయకులు పాల్గొని ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతించారు. స్థానిక స్థాయిలో ఈ సంఘటన కాంగ్రెస్ పార్టీకి మద్దతు బలపడుతున్నదనే సంకేతాలను ఇస్తుండగా, ప్రత్యర్థి పార్టీల్లో మాత్రం అసంతృప్తి వ్యక్తమవుతున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మొత్తంగా జడ్చర్లలో జరిగిన ఈ కార్యక్రమం రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక సమీకరణాల ప్రాధాన్యతను మరోసారి స్పష్టంచేసినట్లైంది

## ఈదమ్మ జాతర ఉన్నందున ఆగిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పునఃప్రారంభం.



**కొల్లాపూర్ ఫిబ్రవరి 18 ప్రజా జ్యోతి**

ప్రస్తుత 4వ వార్డు లోని శివాలయం నుండి ముస్లిం శ్మశాన వాటికకు వెళ్లే దారి మల్లపురాజు కుంట కట్టపై సిసి రోడ్డు రెండవ లేయర్ పనులు పునఃప్రారంభం అయ్యాయి. అలాగే ముస్లిం శ్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ వాజూఖానా బోర్ లైటింగ్ పనులు సి సి రోడ్ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్టు స్థానిక ప్రజలు వివరించారు.

## మున్సిపాలిటీ 15వ వార్డులో విద్యుత్ లైట్ల ఏర్పాటు

**కొల్లాపూర్ ఫిబ్రవరి 18 ప్రజా జ్యోతి**

మున్సిపాలిటీ 15వ వార్డులో ఉన్న స్కాలర్స్ హై స్కూల్ బ్యాక్ సైడ్‌లో విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు. 15వ వార్డు కౌన్సిలర్ మానపాడు నరసింహ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. కాలనీ వాసులుకు విద్యుత్ లైట్లు ఏర్పాటు వల్ల 15వ వార్డులో రాత్రి సమయంలో వెలుతురు మెరుగుపడుతుందని ప్రజలకు భద్రత పెరుగుతుందని వార్డులో ఉన్న ప్రజ ప్రజలు సంతోషించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నాయకులు ఉన్నారు.



## మున్సిపల్ కమిషనర్ నుండి ధ్రువీకరణ పత్రాలను అందుకున్న గెలుపొందిన కౌన్సిలర్లు



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, ఏడవ వార్డు మూడో వార్డు, నుండి గెలుపొందిన టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఈ రోజు సాయంత్రం నారాయణపేట మున్సిపల్ కమిషనర్ నరసయ్య నుండి ఎన్నికల విజయ ధృవీకరణ పత్రాలను అందుకుంటున్న బిఆర్ఎస్ పార్టీ 3వ వార్డు కౌన్సిలర్ ఖ.నారాయణమ్మ ,మరియు 7 వ వార్డు కౌన్సిలర్ భరత్ , ఈ సందర్భంగా వారికి మున్సిపల్ కమిషనర్ అభినందనలు తెలియజేశారు, అలాగే అభ్యర్థులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డులను అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని ప్రజలకు వారు హామీని ఇచ్చారు



## మహిళా సమైక్య భవనానికి భూమి పూజ



**చిన్నంబావి,ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి,మండలంలో దగడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దగడపల్లి గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుండి 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించబోయే మహిళ సమైక్య భవనానికి బుధవారం గ్రామ సర్పంచ్ కొమ్మ గంగాధర్, ఉప సర్పంచ్ మొలకలపల్లి పద్మ, వార్డు నెంబర్లతో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళా సమైక్య భవనాలు మహిళ సంఘాలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. తమ గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన భవనాన్ని నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, వార్డు మెంబర్లు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.,మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా సంక్షేమ అధికారి

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి)**

ఈరోజు నారాయణపేట కలెక్టర్ ఆఫీస్ ప్రాంగణంలో జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ జండా ఊపి ,జస్ట్ ఫర్ రైట్స్ విజన్, సమస్త వారి వందరోజుల ప్రచార రథాన్ని ప్రారంభించారు. వెనుక బడిన నారాయణపేట ప్రాంతంలో బాల్య వివాహాల నిర్మూలన కోసం విజన్ సమస్త వారి ఆధ్వర్యంలో వంద రోజులు జిల్లాలో ఉన్న 13 మండలాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి బాలల హక్కుల పైన అవగాహన కల్పిస్తూ... బాల్య వివాహాల నిర్మూలన కోసం విజన్ సమస్త పాటు పడుతుందని జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. బాల్య వివాహ రహిత నిర్మూలన జిల్లాగా నారంపేట జిల్లాను చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలి. 18 సంవత్సరాల లోపు ఉన్న బాల, బాలికలకు ఎలాంటి సమస్యలు ఉన్న 1098 కు కాల్ చేసి తెలియజేయాలని ఐఔా రాజేందర్ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ అశోక్ శ్యామల యాదయ్య , డి సి పి ఓ కరిష్మా మేడం మరియు విజన్ సమస్త జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింలు, మహిళా సాధికారత విభాగం అధికారి నర్సింలు, సఖి సిఏ క్రాంతి రేఖ మరియు అధికారులు పాల్గొన్నారు.



# లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

**మానవసేవే మాధవసేవ అన్నదానం కంటే నీళ్ల దానం గొప్పది**
**త్వరలోనే అంబలి కేంద్రాలు ఏర్పాటు.**
**కౌన్సిలర్ స్వప్న శిల్ప కిరణ్ తేజ గౌడ్**



**కొల్లాపూర్ ఫిబ్రవరి 18 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ గుండ్రాతి స్వప్న శిల్పా కిరణ్ తేజ గౌడ్ 11వ వార్డు ఉన్న ప్రజల దీవెనలతో ఎన్నికైన సందర్భంగా. బుధవారం రోజు సింగోటం లక్షనరసింహ స్వామి ఆలయ పుణ్యక్షేత్రం లో కుటుంబ సమేతంగా ప్రతేక పూజలు నిర్వహించారు , అలాగే ఖాదర్ పాషా దగ్గర మొఖులుతీర్చుకున్నారు.అనంతరం కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ గా నూతనంగా నియమితులైన రెడ్డి జ్యోతి-సత్యంను శాలువతో సన్మానించారు గుండ్రాతి స్వప్న శిల్ప తేజగౌడు. కొల్లాపూర్ ప్రజలు మాకు ఇచ్చిన అవకాశాన్ని వార్డు అభివృద్ధి వైపు ముందుకు సాగుతామని వివరించారు.నాకు ఏనాడు కూడా చైర్మన్ పదవినీ ఆశపడలేదు ఆశించలేదు, కొల్లాపూర్ ప్రజలు నాపై ఉంచుకున్న ప్రేమ అనురాగం ఆప్యాయత మమకారంతో ప్రజలు మాకు మునిసిపల్ చైర్మన్ పదవి వచ్చుంటే బాగుంటుంది అని ప్రజల అభిప్రాయం ఉన్నది. కానీ నాకు ఏమాత్రం కూడా ఆ పదవి పైన మోజు లేదు, ఏనాటికి మరువను కౌన్సిలర్ గా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డులో అభివృద్ధికి పనిచేసే క్రమంలో పార్టీ బలోపేతం నిబంధనలతో పని చేస్తానని వివరించారు.ఈ అవకాశం ఇచ్చిన పెద్దలు మంత్రి జూపల్లి కృష్ణా రావు కౌన్సిలర్ గా బాధ్యతలు మా పైన పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒకరి సలహా సూచనలతో ముందుకు వెళ్తాము అలాగే మన వార్డులో ఉన్న సమస్యలను కరెంటు గాని. నీరు గాని. సి సి.రోడ్లు. మరియు డ్రైనేజ్ వ్యవస్థ తప్పకుండా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాము అని మాట్లాడారు.బీ.సి సంక్షేమంలో భాగంగా ప్రతి బీసీ బిడ్డ ఎదగాలని మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఈ నిర్ణయాన్ని తీసుకొని మీ పైన పెట్టినటువంటి ఈ పెద్ద బాధ్యత మీరు 19వార్డులలో వార్డులలో ఉన్న కౌన్సిలర్లను దృష్టిలో ఉంచుకొని అందరికీ సరి సమానమైన న్యాయంతో 19వార్డులలో అభివృద్ధి చేసే విధంగా ముందుకు సాగాలని వివరించారు. అలాగే రాబోయే వేసవికాలంలో ప్రతి ఇంటికి నీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు.పాత బస్టాండ్ ఆవరణలో మరియు బంగ్లా పరిధిలో అలాగే కొత్త బస్టాండ్ పరిధిలో అలాగే ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గర చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు అన్నదానం కంటే నీళ్ల దానం గొప్పదని వేసవికాలంలో దాహం తీర్చే విధంగా ప్రజలకు సహాయపడాలని కోరడమైనది.

# ఉదండాపూర్ భూస్వామ్యులకు భారీ నష్టపరిహారం

**- రూ.291 ఎకరాల భూమికి రూ.171.55 కోట్లు మంజూరు**



**మహబూబ్ నగర్ ఫిబ్రవరి 18( ప్రజా జ్యోతి బ్యూరో )**

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో అంతర్గతంగా ఉన్న ఉదండాపూర్ రిజర్వాయర్ భూస్వామ్యులకు ప్రభుత్వం భారీగా నష్టపరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్ ఁ ఆర్ కమిషనర్ కె.శివ కుమార్ నాయకత్వంలో ఎమినెంట్ డొమైన్ చట్టం, ఆధ్వర్యంలో పరిహార ప్రక్రియ పూర్తయింది. ఉదండాపూర్ గ్రామ పరిధిలోని మొత్తం 291 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, ఆర్ ఁ ఆర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ.171.55 కోట్లు నష్టపరిహారం మంజూరు చేయబడింది. రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియ ప్రారంభమైంది.ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పటివరకు సుమారు 2600 ఎకరాల భూమికి గాను 2400 మంది రైతులకు పరిహారం చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. సబ్ బిల్డింగ్స్, వాటర్ ట్యాంకులు, చెట్లు మరియు ఇతర ఆస్తుల వివరాల ఆధారంగా పరిహారం నిర్ణయించారు. ఉదండాపూర్ భూస్వామ్యులకు స్పెషల్ ప్యాకేజీ కింద క్యాష్ బెనిఫిట్స్ రూపంలో మరో రూ.250 కోట్లు, ఇన్‌కైండ్ రూపంలో రూ.430 కోట్లు చెల్లించనున్నట్లు సమాచారం. దీంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులకు వేగం పెరగనుంది.పునరావాస కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు

## పాఠశాలకు శుద్ధ జల యంత్రం విరాళం

**-గడ్డబస్వాపూర్ ప్రాథమిక పాఠశాలకు ఆర్ఓ తాగునీటి యంత్రాని ఆవిష్కరణ**
**ఎంపీడీఓ చేతుల మీదుగా ఆర్ఓ ప్రారంభం**

**చిన్నంబావి: ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి)**

వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని గడ్డబస్వాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో గ్రామానికి చెందిన ఎన్. విజయ్ కుమార్ మరియు గ్రామ ఉపసర్పంచ్ బీసన్న కలిసి 12 లీటర్ల సామర్థ్యం గల ఆర్ఓ తాగునీటి శుద్ధి యంత్రాన్ని పాఠశాలకు విరాళంగా అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్, మండల ఎంఈవో పీఆర్ రాజేందర్,ప్రధానోపాధ్యాయులు గోవింద్, గ్రామ సర్పంచ్ మల్లికల్, ఉపసర్పంచ్ బీసన్న సంయుక్తంగా యంత్రాన్ని ప్రారంభించారు.ఈ యంత్రం ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందడంతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని, విద్యార్థుల భవిష్యత్తుకు ఇది భరోసాగా నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. ముఖ్యంగా దాతల పిల్లలు ఇదే పాఠశాలలో చదివి గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందిన సందర్భంగా కృతజ్ఞతతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అందరికీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.అనంతరం ఎంపీడీవో ఎంఈఓ,ఉపాధ్యాయులకు, ప్రజా ప్రతినిధులకు గ్రామస్థులు శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామస్తులు, అధికారులు ఈ కార్యక్రమానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్,ఉపాధ్యాయులు వెంకటేష్,అంగన్వాడీ కార్యకర్త వేనమ్మ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం జరిగింది

**బండ గోండ గ్రామ సర్పంచ్ రామచందర్**



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట మండలం బండ గుండ నుండి మోమిన్ పూర్ గ్రామానికి మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిగా నిర్మించడం జరిగిందని గ్రామ సర్పంచ్ రామచందర్ దాదాపుగా 9 కోట్లు వ్యయంతో నిర్మాణం అవుతుందని,తెలిపారు, ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగవుతుందని ఆయన తెలిపారు , ప్రజలకు ఇచ్చిన హామీలను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెంపర్ణిక రెడ్డి సహకారంతో,ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు, అక్కడక్కడ చిన్న చిన్న పనులు, ఉన్నాయని అవి పూర్తిగా అయిపోతాయని దాంతో ఈ రెండు గ్రామ ప్రజలకు ప్రధాన సమస్యగా ఉన్న రవాణా సమస్య పూర్తిగా తీరిపోతుందని ఆయన అన్నారు,

## రెండవ రోజు వార్డు సభ్యుల శిక్షణా తరగతులు



**నర్వ ఫిబ్రవరి 18 ప్రజా జ్యోతి**

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారంగా నా నర్వ మండలంలోని రైతు వేదికలలో గ్రామపంచాయతీ వార్డు సభ్యుల కు బుధవారం రెండవ రోజు శిక్షణా కార్యక్రమం కొనసాగింది ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు , వీరికి ప్రత్యేక వాలంటీర్లతో శిక్షణ ఇచ్చారు , గ్రామాలలోని వార్డుల అభివృద్ధితో పాటు , విధులు నిధులు గురించి అవగాహన కల్పించారు, గ్రామాల్లోని వార్డులలో వార్డు సభ్యులు బాధ్యత ఎలా ఉంటుందని అంశాలను, వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు, ఈ సమావేశాలలో గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు

## కిష్టాపూర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల కోసం స్వచ్ఛ భారత్ కార్యక్రమం

**ధన్వాడ ఫిబ్రవరి 18(ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను యువత ఘనంగా నిర్వహించేందుకు శివాజీ మహారాజ్ దేశభక్తి ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకున్న గ్రామ యువకులు స్వచ్ఛందంగా స్వచ్ కిష్టాపూర్ కార్యక్రమాన్ని చేపట్టారు జయంతి సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులు దేవాలయ ప్రాంగణాలు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు చెత్తను తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలనే సందేశాన్ని యువత ఇచ్చారు శివాజీ మహారాజ్ చూపిన నాయకత్వ లక్షణాలు సమాజ సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారుఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండయ్య శ్రీను నర్సిములు వెంకటేష్ యాదయ్య కృష్ణ రాఘవేందర్ తిరుపతి కృష్ణ తదితర యువకులు మరియు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు గ్రామ ప్రజలు యువత తీసుకున్న ఈ మంచి ప్రయత్నాన్ని అభినందించారు



